తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శుక్రవారం - 27 - ఫిబ్రవరి - 2026 | సంపుటి : 3 | సంచిక : 270 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# గ్రూప్–1, గ్రూప్–2 యువ అధికారులతో ముఖ్యమంత్రి సమావేశం

### శిక్షణ పూర్తి చేసిన తొలి బ్యాచ్‌కు అభినందనలు

### పెద్దన్నగా వెళ్లానని రేవంత్ రెడ్డి భావోద్వేగం

### న్యాయపోరాటంతో భవిష్యత్‌కు వెలుగు నింపామన్న వ్యాఖ్య



**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర తొలి గ్రూప్-1, గ్రూప్-2 అధికారులుగా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న యువ అధికారులతో ఈ రోజు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంగణంలో సమావేశమయ్యారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కాబోతున్న ఈ యువ బృందంతో భావోద్వేగ అనుబంధంతో పాల్గొన్నానని తెలిపారు.

మిగతా 2లో..

# ప్రభుత్వ విద్యకు కొత్త దిశ



### సమగ్ర మార్పులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం

### కోర్ అర్బన్ ప్రాంత పాఠశాలలకు అత్యున్నత మౌలిక వసతులు

### ఉదయ భోజన పథకం, పాల సరఫరా పకడ్బందీ అమలు

### అధిక ఫీజులపై కఠిన నిబంధనలు, రవాణా సదుపాయాల పైలట్ ప్రాజెక్ట్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విద్యాశాఖపై విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించి ప్రభుత్వ విద్యా వ్యవస్థలో నాణ్యత పెంపు దిశగా కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు సామాన్యుల ఆశ్రయంగా మాత్రమే కాకుండా, అత్యుత్తమ విద్య అందించే కేంద్రాలుగా మారాలనే లక్ష్యంతో సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

మిగతా 2లో..

# వెలుగుమట్ల ఘటనపై మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

- బిఆర్ఎస్ హయాంలోనే గుడిసెల కూల్చివేత జరిగిందని ఆరోపణ
- పేదల పేరుతో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారన్న విమర్శ
- అర్హులైన వారికి ఇల్లు, స్థలం ఇస్తామని హామీ



**ఖమ్మం, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెలుగుమట్లలో పేదల గుడిసెల కూల్చివేత అంశంపై మీడియా సమావేశంలో స్పందించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 2023 జూలై 15న వెలుగుమట్లలో పేదల గుడిసెలను కూల్చివేశారని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు అదే నాయకులు పేదల ఇళ్లు కూలగొడుతున్నామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పేదలపై ప్రేమ ఉన్నట్టు గోబెల్స్ తరహా ప్రచారం చేయడం సరికాదని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం పేదల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిందని, నిజమైన ఏ పేదవాడినీ ఇబ్బంది పెట్టబోమని స్పష్టం చేశారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో బాధితులకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

మిగతా 2లో..

## కాంగ్రెస్ ఇండ్లు కూల్చిన చోటే, ఇండ్లు కట్టించే బాధ్యత మాది –కేటీఆర్



- బాధితులకు అండగా నిలిచి, ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రి పువ్వాడ
- కాంగ్రెస్ కూల్చివేతలపై శాసనసభ నుంచి సుప్రీంకోర్టు వరకు పోరాటం చేస్తాం..
- ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూల్చడమేనా?
- పట్టాలు, పన్ను రశీదులు ఉన్నా మెడలు పట్టి గెంటేస్తారా?

2లో



## రహదారి పనులు నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలి

- ఇందిరాభవన్‌లో ఆర్అండ్‌బీ సమీక్ష సమావేశం
- వంతెనలు, నాలుగు లేన్ల రహదారులకు గడువులు
- నాణ్యతలో రాజీ లేదని స్పష్టీకరణ
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**నల్గొండ, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్గొండ జిల్లాలో జరుగుతున్న రహదారులు, వంతెనల నిర్మాణ పనుల పురోగతిపై ఈ రోజు నల్గొండలోని ఇందిరాభవన్‌లో ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కీలక మార్గాల నిర్మాణం ఆలస్యం కాకుండా వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

మిగతా 2లో..

## రెండో రోజు ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- 4.52 లక్షల మంది విద్యార్థుల హాజరు
- 10,374 మంది గైర్హాజరు నమోదు
- నాలుగు మాల్ ప్రాక్టీస్ కేసులు వెలుగులోకి

2లో

## నాగసమందర్ వద్ద హై లెవల్ బ్రిడ్జికి 27.50 కోట్లు మంజూరు

- వికారాబాద్ ప్రజలకు రవాణా సౌలభ్యం
- శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కృషి

2లో



## ఇళ్ల కూల్చివేతలపై ఈటల ఆగ్రహం

- మూసీ ప్రక్షాళన పేరిట సామాన్యులపై జులుం ఆరోపణ
- గాంధీ పార్కు నిర్మాణంపై ప్రశ్నలు
- రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఖమ్మం నుంచి హైదరాబాద్ వరకు సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తూ బడుగు జీవులపై ఒత్తిడి తీసుకొస్తోందని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన పేరుతో వందలాది ఇళ్లను నేలమట్టం చేస్తున్నారని ఆరోపించారు. మధుపార్క్ వంటి అపార్ట్‌మెంట్లలో నివసించే వారి ఆవేదన ప్రభుత్వానికి వినిపించడం లేదా అని ప్రశ్నించారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గ్రూప్–1, గ్రూప్–2 యువ అధికారులతో ముఖ్యమంత్రి సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రిగా కాదు, పెద్దన్నగా వారిని కలిశానని పేర్కొన్నారు. పేదరికం నేపథ్యం నుంచి, తల్లిదండ్రుల కష్టార్జిత శ్రమ నుంచి స్ఫూర్తి పొందిన ఈ యువ అధికారులు స్వగడ్డకు సేవ చేయబోతున్నారన్న ఆలోచన తనకు ప్రత్యేక అనుభూతిని కలిగించిందని చెప్పారు. వారి ప్రతిభ, ఆత్మగౌరవాన్ని కొంతమంది దుష్టశక్తులు దెబ్బతీయాలని ప్రయత్నించాయని వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థలో జరిగిన సవాళ్లను ప్రజా ప్రభుత్వం న్యాయపోరాటం ద్వారా ఎదుర్కొని విజయం సాధించిందని తెలిపారు
యువ అధికారుల భవిష్యత్తును చీకటిలో నెట్టే ప్రయత్నాలను అడ్డుకుని వారి జీవితాల్లో వెలుగులు నింపామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ విజయంతో ప్రభుత్వానికి తృప్తి లభించిందని చెప్పారు. ప్రజా సేవలో నిబద్ధత, అంకితభావం అత్యంత ముఖ్యమని యువ అధికారులకు సూచించారు. "గరం, నరం, బేషరం" అన్న నానుడి తప్పని ఈ యువ బృందం రుజువు చేసిందని వ్యాఖ్యానించారు. ఉద్యోగంలో చేరిన మొదటి రోజు ఏ అంకితభావంతో ఉంటారో, పదవీ విరమణ రోజున కూడా అదే నిబద్ధతతో పేదలకు సేవ చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈ యువ అధికారుల పాత్ర కీలకమవుతుందని పేర్కొన్నారు.

# ప్రభుత్వ విద్యకు కొత్త దిశ



(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా కోర్ అర్బన్ ప్రాంతంలోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల లోటుపాట్లను వెంటనే గుర్తించి సరిదిద్దాలని ఆదేశించారు. యంగ్ ఇండియా సమగ్ర పాఠశాలల నిర్మాణంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ఆయన కఠినంగా సూచించారు. ఈ పాఠశాలలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని, ఆధునిక తరగతి గదులు, సాంకేతిక సదుపాయాలు, శాస్త్ర ప్రయోగశాలలు, క్రీడా మైదానాలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు వంటి అన్ని వసతులు కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు భారతీయ విద్యా భవన్, జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్ తరహాలో ప్రమాణాలతో అభివృద్ధి చెందాలనే దిశగా కార్యాచరణ చేపట్టాలని స్పష్టం చేశారు.
ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉదయ భోజన పథకాన్ని కచ్చితంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య స్థితి మెరుగుపడేలా పోషకాహారం అందించడమే లక్ష్యమని చెప్పారు. ఈ పథకంలో అందించే పాలను విజయా డైరీ నుంచి సేకరించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ చర్యల ద్వారా విద్యార్థుల హాజరు శాతం పెరగడమే కాకుండా, చదువుపై దృష్టి కేంద్రీకరించే వాతావరణం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. కోర్ అర్బన్ ప్రాంతం మినహా ఇతర నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించాలని ప్రతిపాదించారు. విద్యుత్ బస్సుల వినియోగంపై సమగ్ర అధ్యయనం చేసి, పర్యావరణ హిత చర్యలను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు చేయడంతో పాటు వసూలైన మొత్తాన్ని తిరిగి పొందేలా కఠిన నిబంధనలు రూపొందించాలని పేర్కొన్నారు. ఫీజుల నియంత్రణకు సంబంధించిన సిఫారసులను ప్రజాభిప్రాయం కోసం అధికారిక వెబ్‌సైట్లలో ఉంచి పారదర్శకతను పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యను సమాన అవకాశాల వేదికగా మార్చడమే లక్ష్యమని ముఖ్యమంత్రి వెల్లడించారు.

# ఇళ్ల కూల్చివేతలపై ఈటల ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా పేదలకు కొత్తగా ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, ఉన్న నివాసాన్ని కూడా తొలగించడం దారుణమని వ్యాఖ్యానించారు. ఇల్లు కోల్పోయిన కుటుంబాలకు తక్షణ ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు, విద్యార్థుల డైట్ ఛార్జీలకు నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం వేల కోట్లు వెచ్చించి గాంధీ పార్కు నిర్మాణం చేపట్టడం విడ్డూరమని అన్నారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోకుండా సామాన్యులపై మాత్రమే కఠినంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ వద్ద భూముల అన్యాక్రాంతంపై కూడా స్పందించాలన్నారు. తెలంగాణలో జరుగుతున్న పరిణామాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించాలని ఈటల డిమాండ్ చేశారు. పేదల ఇళ్లను కూల్చి అభివృద్ధి పేరుతో చర్యలు తీసుకోవడం సరికాదని హెచ్చరించారు. బాధితుల తరపున పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# రహదారి పనులు నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)



బుద్ధారం-అప్పాజిపేట-బ్రాహ్మణవెల్లం రహదారి పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు. సోమనవాగుపై పగిడిమర్రి వంతెన నిర్మాణాన్ని మూడు నెలల్లో ముగించాలని గడువు విధించారు. కనగల్ జంక్షన్-కనగల్ నాలుగు లేన్ల రహదారి, కనగల్-తిమ్మన్నగూడెం, మామిడాల తదితర గ్రామాల రహదారి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.
జిల్లాలో రహదారి అనుసంధానం బలోపేతం అయితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడితే గ్రామీణ ప్రాంతాలకు పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రహదారులు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని హెచ్చరించారు. నిర్ణీత గడువులు పాటించని కాంట్రాక్టర్లు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులకు తెలిపారు. పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ఇండ్లు కూల్చిన చోటే, ఇండ్లు కట్టించే బాధ్యత మాది–కేటీఆర్



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 26(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం వెలుగుమట్లలో కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన ఇళ్ల కూల్చివేత బాధితులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించిన సమయంలో హృదయవిదారక దృశ్యాలు కనిపించాయి. బాధితులు తమ కన్నీళ్లను ఆపుకుంటూ, తమ వద్ద ఉన్న భూమి పట్టా కాగితాలు, ప్రభుత్వానికి కట్టిన ఆస్తి పన్ను రశీదులు, ఇంటి పన్ను కాగితాలు మరియు విద్యుత్ కనెక్షన్ కోసం కట్టిన డీడీలను కేటీఆర్ కి చూపించారు. "అన్నా, ఇవన్నీ ప్రభుత్వమే ఇచ్చిన కాగితాలు కదా, మరి మా ఇళ్లను ఎలా కూలుస్తారు?" అంటూ వారు తమ ఆవేదనను వెళ్లగక్కారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జీవోల ప్రకారం దరఖాస్తు చేసుకుని, ఎలాంటి ఇబ్బంది లేకుండా నివసిస్తున్న తమను, ప్రస్తుత ప్రభుత్వం అర్ధరాత్రి వేళ దౌర్జన్యంగా ఖాళీ చేయించిందని వారు వాపోయారు.

**ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్ ఆగ్రహం**

బాధితుల వద్ద ఉన్న అన్ని రకాల ధృవీకరణ పత్రాలను పరిశీలించిన కేటీఆర్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాల్సిన "ఇందిరమ్మ రాజ్యం"లో, ఉన్న ఇళ్లను కూలగొట్టడం అన్యాయమని ధ్వజమెత్తారు. ప్రభుత్వమే ఇచ్చిన పట్టాలు, భూదాన్ బోర్డు పత్రాలు మరియు కోర్టు ఆర్డర్లు ఉన్నప్పటికీ, కనీస నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను ధ్వంసం చేయడం అమానుషమని ఆయన విమర్శించారు. ఖమ్మంలో 150 ఇళ్లతో పాటు, మహబూబ్‌నగర్‌లో దివ్యాంగుల ఇళ్లను కూడా కూల్చివేయడం ఈ ప్రభుత్వ అరాచక పాలనకు నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. కేవలం ఆర్డీవోను బదిలీ చేస్తే సరిపోదని, బాధితులకు న్యాయం జరగాలని డిమాండ్ చేశారు.

**బాధితులకు భరోసా మరియు పునరావాస హామీ**

కూల్చివేతకు గురైన కుటుంబాలకు కేటీఆర్ గారు అండగా నిలిచారు. "మీరు ఎవరూ అధైర్యపడకండి, ఏడవకండి.. మీ అందరికీ మళ్ళీ ఇదే స్థలంలో ఇళ్లు కట్టించి, గృహప్రవేశాలు చేయించే బాధ్యత నాది" అని ఆయన హామీ ఇచ్చారు. ఈ పోరాటంలో భాగంగా కలెక్టర్ మరియు చీఫ్ సెక్రటరీలను కలిసి బాధితుల పక్షాన నిలబడతామని చెప్పారు. శాసనసభ, శాసనమండలి వేదికలుగా ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లి న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పేదల పక్షాన పోరాడాలని కేసీఆర్ గారు ప్రత్యేకంగా చెప్పారని, బాధితులు ఐకమత్యంగా ఉండాలని ఆయన కోరారు.

**న్యాయ పోరాటంపై స్పష్టత**

ప్రభుత్వం బాధితులను విడదీసే ప్రయత్నం చేస్తుందని, కానీ అందరూ కలిసికట్టుగా ఉంటేనే విజయం సాధించగలమని కేటీఆర్ సూచించారు. కలెక్టర్ తమతో అబద్ధాలు చెప్పారని బాధిత మహిళలు ఫిర్యాదు చేయగా, అధికారులు మరియు ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగడతామని ఆయన భరోసా ఇచ్చారు. చట్టపరమైన అన్ని ఆధారాలు బాధితుల వైపు ఉన్నాయని, కాబట్టి భయపడాల్సిన అవసరం లేదని కేటీఆర్ వారికి ధైర్యాన్ని నూరిపోశారు.

# వెలుగుమట్ల ఘటనపై మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

(మొదటి పేజీ తరువాయి)

అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. నష్టపోయిన పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. వాస్తవాలను ప్రజల ముందుంచుతామని, పేదల సంక్షేమంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.

# రెండో రోజు ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



**మేడ్చల్–మల్కాజ్గిరి, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. రెండో రోజు గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం ద్వితీయ భాష పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అంతరాయాలు చోటుచేసుకోలేదని తెలిపారు. మొత్తం 4,63,354 మంది విద్యార్థులు పరీక్షలకు నమోదు చేసుకోగా, 4,52,980 మంది హాజరయ్యారని వివరించారు. 10,374మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి, విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించినట్లు తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు సంబంధించిన నాలుగు ఘటనలు నమోదయ్యాయి. వరంగల్‌లో ముగ్గురు, రంగారెడ్డి జిల్లాలో ఒకరు అక్రమాలకు పాల్పడుతూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. సంబంధిత విద్యార్థులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వనపర్తి, వికారాబాద్, భద్రాద్రి, ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్, సిద్దిపేట, మెదక్, కరీంనగర్, ములుగు, పెద్దపల్లి జిల్లాల్లోని పరీక్షా కేంద్రాల పర్యవేక్షణకు ప్రత్యేక పరిశీలకులను నియమించినట్లు తెలిపారు. పరీక్షలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని బోర్డు అధికారులు స్పష్టం చేశారు.

# నాగసమందర్ వద్ద హై లెవల్ బ్రిడ్జికి 27.50 కోట్లు మంజూరు

**వికారాబాద్, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూర్ నుంచి కోట్‌పల్లి వెళ్లే మార్గంలోని నాగసమందర్ వద్ద కోట్‌పల్లి వాగుపై నూతన హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.27.50 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ కృషితో ఈ నిధులు ఆమోదించబడినట్లు తెలిపారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో వాగు ఉప్పొంగినా రాకపోకలకు అంతరాయం ఉండదని అధికారులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సురక్షిత, సౌకర్యవంతమైన రవాణా అందుబాటులోకి రానుంది. విద్యార్థులు, రైతులు, వ్యాపారులకు ఈ వంతెన ఎంతో ఉపయోగపడనుంది. నాగసమందర్ ప్రాంతంలో వాగు కారణంగా తరచుగా రవాణా సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరమని ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రాంతీయ అనుసంధానం బలోపేతం అవుతుందని భావిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

# మూసీ రివర్‌ఫ్రంట్‌పై అన్వేష్ మద్దతు

- ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహం ప్రతిపాదనపై స్పందన

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన 'మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్' ప్రాజెక్టు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహాన్ని నిర్మించాలనే ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ ట్రావెల్ యూట్యూబర్ అన్వేష్, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్ణయానికి మద్దతు ప్రకటించారు. విగ్రహాల నిర్మాణాన్ని కేవలం రాజకీయ కోణంలో కాకుండా, పర్యాటక ఆర్థిక ప్రయోజనాల దృష్టితో చూడాలని సూచించారు. గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ఉదాహరణగా చూపిస్తూ అన్వేష్ విశ్లేషణ చేశారు. సర్దార్ పటేల్ విగ్రహం నిర్మాణ సమయంలో వచ్చిన విమర్శలను గుర్తు చేస్తూ, ఆ ప్రాజెక్టు వల్ల రాష్ట్రానికి గణనీయమైన ఆదాయం లభించిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ప్రతిపాదించిన గాంధీ విగ్రహం కూడా భవిష్యత్తులో తెలంగాణకు ఆర్థిక లాభాలు చేకూరుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు, మౌలిక వసతులు కూడా మెరుగుపడతాయని చెప్పారు. తాను ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదని, అభివృద్ధి వైపే తన మద్దతు ఉంటుందని అన్వేష్ స్పష్టం చేశారు. పర్యావరణం లేదా ఇతర కారణాలను చూపుతూ అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిగా అడ్డుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. పలు దేశాల్లో పర్యాటక కేంద్రాల అభివృద్ధి తర్వాతే మౌలిక సదుపాయాలు వేగంగా అభివృద్ధి చెందాయని తన అనుభవంతో వివరించారు. అయితే, ప్రాజెక్టు అమలులో సామాన్య ప్రజల ఇళ్లను కూల్చడం వంటి చర్యలు చేపట్టకూడదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా, ప్రత్యామ్నాయ మార్గాల్లో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పర్యాటక అభివృద్ధి, సామాజిక న్యాయం రెండింటినీ సమతుల్యం చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక


## ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి



**ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 26(తెలంగాణ ముచ్చట్లు):** వైరా మండల పరిధిలోని కేజీ సిరిపురం గ్రామంలోశ్రీ వీరాంజనేయ స్వామి జీవధ్వజ శిఖర ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ మరియు స్ట్రాటజీ కమిటీ మెంబర్ డాక్టర్ లోకేష్ యాదవ్ కార్యక్రమంలో పాల్గొని జీవధ్వజ వద్ద గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## వైరా ఎసిపి మర్యాదపూర్వకంగా కలిసిన నంబూరి రామారావు



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 26(తెలంగాణ ముచ్చట్లు ):** వైరా ఏసిపి సారంగపాణిని వైరా ఆర్యవైశ్య నాయకులు నంబూరి రామారావు రిజియన్ పెనుగొండ ఉపేందర్ రావు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు... ఈ సందర్భంగా ఆయనకుపుష్పగుచ్చం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమంలోలయన్స్ క్లబ్ సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరావు నాళ్ళ నాగేశ్వరరావు అబ్బూరి రమేష్వాసిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం క్యాలెండర్ డైరీ ఆవిష్కరణ



- **జిల్లా యువజన మరియు క్రీడల అధికారి టి. సునీల్ రెడ్డి**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ను డైరీ ని గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా యువజన మరియు క్రీడల అధికారి టి. సునీల్ రెడ్డి హాజరై క్యాలెండర్ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల ఐక్యత మరియు సేవా స్ఫూర్తి సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలను సమర్థంగా అమలు చేయడంలో నాన్ గెజిటెడ్ అధికారుల పాత్ర కీలకమని ఆయన అన్నారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ మరియు పరస్పర సహకారం కోసం సంఘం కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.సంఘం నాయకులు మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో నాగమణి , లింగంపల్లి గంగన్న కె చందనా , శైలజ , కె. వెంకన్న బి. రామ్దాస్ పి. బాబు ఆంజనేయులు ,కె విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం లో గుడ్ ఇయర్ టైర్ల ఆటో కేర్ షో రూంను ప్రారంభించిన డాక్టర్ తుమ్మల యుగంధర్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు






### ప్రో ప్రైటర్ రావులపాటి నిఖిల్

**ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 26(తెలంగాణ ముచ్చట్లు):** మమత మెడికల్ కాలేజ్ రోడ్ లోసీత మోటార్స్ కు ఎదురుగా గుడ్ ఇయర్ ఆటోకేర్ ఫోర్ వీల్స్ మరియు టైర్ షోరూం ను, ప్రారంభించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ మొదటగా రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసారు, అనంతరం కేక్ కట్ చేసి మాట్లాడుతూ, మొదట గా ప్రోప్రైటర్ రావులపాటి నిఖిల్ కు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆటో మొబైల్ రంగం లో నెంబర్ వన్ కంపెనీ అయిన గుడ్ఇయర్ ఆటోకేర్ షో రూమ్ ఇప్పుడు మన ఖమ్మం కి రావడం చాలా సంతోషంగా ఉంది. వెహికల్స్ కి మంచి మైలేజ్, ఫ్యూయల్ ఎఫిషియన్సీ, మరియు కంఫర్ట్ లెవెల్ ఉన్న టైర్స్ ఇప్పుడు గుడ్ఇయర్ ఆటో కేర్ వీల్స్ లో అందుబాటులో ఉన్నాయి, కావున మన ఖమ్మం ప్రజలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోగలరు అని, ఈ సందర్భంగా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గుడ్ఇయర్ ఆటోకేర్ కంపెనీ ప్రతినిధులు, డెన్నిస్ డానియల్, పీయూష్ కె పడ్గిల్, వి.నాగరాజు, బి.నరేందర్ రాజు, మరియు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దుబ్బల సౌజన్య, కార్పొరేటర్ చావా నారాయణ, ఏ.ఎం.సి చైర్మన్ యార్లగడ్డ హనుమంతరావు, సిటీ కాంగ్రెస్ ఓబిసి చైర్మన్ బాణాల లక్ష్మణ్ మరియు రావులపాటి శ్రీనివాసరావు, సీత మోటార్స్ కిషోర్, కృషి ఆటో వర్క్స హలీం, కారు ఏసీ వర్క్స మహేష్, ఏలూరు రవికుమార్, దొడ్డ ప్రవీణ్, సిరిపురపు సుదర్శన్ రావు తదితరులు పాల్గొన్నారు.





## సంత్ సేవాలాల్ మహారాజ్ మందిర నిర్మాణానికి భూమి కేటాయించాలి

### మాజీ ఎంపీ సీతారాం నాయక్

**హైదరాబాద్,ఫిబ్రవరి26(తెలంగాణ ముచ్చట్లు):**బంజారా జాతి ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్కు రాజధాని నగరంలో దివ్యమైన మందిరం నిర్మించేందుకు 20 ఎకరాల భూమిని కేటాయించాలని వివిధ బంజారా సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును కలిసి వినతిపత్రం సమర్పించారు.ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ పార్లమెంట్ సభ్యుడు ఆచార్య అజ్మీర సీతారాం నాయక్ సారథ్యంలో జరిగిన ఈ భేటీలో, హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ సమీపంలో మందిర నిర్మాణానికి తగిన స్థలం కేటాయించాలని కోరినట్లు తెలిపారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో సుమారు 15 లక్షల మంది బంజారా ప్రజలు, అదిలాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో కలిపి సుమారు 30 లక్షల జనాభా ఉన్న నేపథ్యంలో, ఈ మందిరం ఆధ్యాత్మిక కేంద్రంగా మాత్రమే కాకుండా సాంస్కృతిక పరిరక్షణ స్థావరంగా, పర్యాటక ఆకర్షణగా అభివృద్ధి చెందుతుందని వివరించారు.మందిర నిర్మాణం ద్వారా బంజారా సమాజ ఐక్యత మరింత బలపడడంతో పాటు, భవిష్యత్ తరాలకు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ సాధ్యమవుతుందని సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ వినతిని సానుకూలంగా పరిశీలించి బంజారా సమాజ ఆధ్యాత్మిక, సాంస్కృతిక అభివృద్ధికి సహకరించాలని సంఘాల ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ సింగ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం. ధనుంజయ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బస్కి నాయక్, ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ చైర్మన్ రవీందర్ నాథ్ రాథోడ్, తెలంగాణ అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్, ప్రవీణ్ నాయక్, మీడియా కార్యదర్శి తేజావత్ భీముడు నాయక్ తదితరులు పాల్గొన్నారు.





## రబ్బి జాతీయ పోటీల్లో టీజీ ఎంఆర్ ఎస్ ఖమ్మం గర్ల్స్ -1ప్రభంజనం

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 26(తెలంగాణ ముచ్చట్లు):** జాతీయస్థాయి రబ్బి పోటీల్లో రఘునాథపాలెం మండలం కి చెందిన తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలకు ఖమ్మం బాలిక 1 పాఠశాల విద్యార్థినుల అద్భుత ప్రతిభను కనబరిచిన రాష్ట్ర జిల్లాస్థాయిలో ఖ్యాతిని సొంతం చేసుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. శైలజ హర్షం వ్యక్తం చేశారు రఘునాథపాలెం మండలం శారద ఇంజనీరింగ్ కాలేజ్ కళాశాలలో ఉన్న తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల ఖమ్మం గర్ల్స 1 బాలికల పాఠశాల విద్యార్థిను జాతీయస్థాయి రబ్బి పోటీల్లో పాల్గొని విజయకేతనం ఎగరవేసి పాఠశాలకు తిరిగి వచ్చిన విద్యార్థులను బుధవారం ఉపాధ్యాయులు సిబ్బంది ఘనంగా సన్మానించారు

ఈ సందర్భాలలో ప్రధానోపాధ్యాయురాలు ఏం శైలజ మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్ర చెన్నైలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన సౌత్ జోన్ కే లో ఇండియా ఉమెన్స్ రబ్బి లీగ్ పోటీలో తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల ఖమ్మం గర్ల్స 1 విద్యార్థినుల అండర్ 15 విభాగాలలో జాతీయస్థాయిలో మూడవ స్థానాన్ని సాధించి కాంస్య పథకాలను కైవసం చేసుకోవడానికి అత్యంత గర్వకారణం అన్నారు ప్రత్యేకంగా ఎండి ఆఫ్రిన్ 9వ తరగతి షేక్ సన 9వ తరగతి షేక్ సల్మా మెహతా 8 తరగతి, కే సాయి ప్రహర్షిని 9వ తరగతిలో కాస్యం పథకాలు సాధించడం ప్రశంసనీయమని తెలిపారు అలాగే ఖమ్మం జిల్లా రబ్బి అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సబ్ జూనియర్ బాలికల విభాగంలో మొత్తం 11 మంది ద్వితీయ స్థానాన్ని సాధించగా అందులో నలుగురు విద్యార్థులు తమ పాఠశాలకు చెందిన వారు ఉండటం పాఠశాలలకు మండలానికి మరింత గౌరవాన్ని తీసుకు వచ్చిందన్నారు గ్రామీణ ప్రాంత బాలికలు జాతీయస్థాయిలో రాణించడం ద్వారా క్రీడల్లోనూ తమ సత్తా నిరూపించారని భవిష్యత్తులో మరెందరో విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుంది అన్నారు విజేతలుగా నిలిచిన క్రీడాకారులు పాఠశాల తరపున శాలువాలతో సత్కరించి వారి తల్లితండ్రులను ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమాలలో పి ఈ టి ప్రేమారాణి ఉపాధ్యాయునులు మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏం శైలజ పాల్గొని విద్యార్థినులకు అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా డిస్టిక్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేకంగా విద్యార్థినులకు అభినందనలు తెలిపారు మరియు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ ఎజె అరుణకుమారి మరియు విజిలెన్స్ ఆఫీసర్ కె సీతారాములు ప్రత్యేకంగా విద్యార్థినులను అభినందించారు



## దళిత బహుజనులపై దాడులు ఆపాలి

### కీసరలో ఎంఆర్పిఎస్ సమావేశం

**కీసర, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** దళితులు, బీసీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో కీసర మండల కేంద్రంలోని పెద్దమ్మ గుడి ప్రాంగణంలో గురువారం ఆగ్రహ సమావేశం నిర్వహించారు. ఎంఆర్పిఎస్ కీసర మండల అధ్యక్షులు మంచాల మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌరవ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఇటీవల చోటుచేసుకున్న కర్ల రాజేష్ మృతి ఘటనతో పాటు రెండు నెలల చిన్నారి కుల అహంకారానికి బలైన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళితులు, బీసీలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దళిత బహుజనుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఎంఆర్పిఎస్ ఎల్లప్పుడూ ముందుండి పోరాటం చేస్తుందని, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమించేందుకు మండల స్థాయిలో నూతన కమిటీల ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామారం సుజాత, మేడిపల్లి ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు బండారి సాయి, ఎంఆర్పిఎస్ ఇంచార్జి బుడిగే జగన్, మాజీ మండల అధ్యక్షులు బక్కని కుమార్ జేకే, సామాజిక సేవ కార్యకర్త తుడుం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తుడుం బాలరాజు, అంబేద్కర్ సంఘం మాజీ కోశాధికారి కానుకుంటా శ్యామ్ కుమార్, మీసాల శ్రీశైలం, కీసర గ్రామ శాఖ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఎర్ర సాయిలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# జిల్లా అదనపు కలెక్టర్‌గా ఫైజాన్ అహ్మద్ బాధ్యతలు స్వీకారం





**మేడ్చల్ – మల్కాజిగిరి, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ గా ఫైజాన్ అహ్మద్, ఐఎఎస్ (2021 బ్యాచ్)ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు ఉత్తర్వుల మేరకు నియమించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో ని అదనపు కలెక్టర్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.ఫైజాన్ అహ్మద్ గతంలో నిర్మల్ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనా అంశాల్లో సమర్థవంతంగా పనిచేసిన ఆయనను మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాకు బదిలీపై నియమించారు.జిల్లాలో స్థానిక సంస్థల అభివృద్ధి, గ్రామీణ-పట్టణ మౌలిక వసతుల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఫైజాన్ అహ్మద్ పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాల అమలులో పారదర్శకత, సమన్వయం, వేగవంతమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# 'అరైవ్ అలైవ్ –2026' ఫేజ్–2 లో భాగంగా హెవీ వెహికల్ డ్రైవర్లకు కంటి పరీక్షా శిబిరం





**కుషాయిగూడ, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** రోడ్డు ప్రమాదాల నివారణకు మరియు డ్రైవర్లలో భద్రతా అవగాహన పెంపొందించేందుకు "'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్-2026 (ఫేజ్-2) కార్యక్రమంలో భాగంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం కుషాయిగూడ పరిధిలో హెవీ వెహికల్ డ్రైవర్ల కోసం ఏర్పాటు చేయబడింది .ఈ సందర్భంగా కుషాయిగూడ ఎస్ఐ ఎన్. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, లారీలు, బస్సులు వంటి భారీ వాహనాలను నడిపే డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని తెలిపారు. భారీ వాహనాల నియంత్రణలో స్పష్టమైన దూర దృష్టి, పక్కదృష్టి (సైడ్ విజన్), సరైన లోతు గ్రహింపు (డెప్త్ పర్సెప్షన్) కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. రహదారి సూచికలు, ట్రాఫిక్ సిగ్నల్స్, ముందున్న అడ్డంకులను సమయానికి గుర్తించడానికి మంచి కంటి చూపు అత్యంత అవసరమని పేర్కొన్నారు. అదేవిధంగా క్యాటరాక్ట్, గ్లాకోమా వంటి కంటి వ్యాధులు ప్రారంభ దశలో స్పష్టమైన లక్షణాలు లేకుండానే వస్తాయని, కాబట్టి పర్యాయ కంటి పరీక్షల ద్వారా ముందుగానే గుర్తించి చికిత్స పొందడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని వివరించారు. డ్రైవర్ల ఆరోగ్యం కాపాడడం అంటే ప్రజల ప్రాణాలను రక్షించడమేనని ఆయన అన్నారు.ఈ శిబిరంలో పలువురు హెవీ వెహికల్ డ్రైవర్లు ఉత్సాహంగా పాల్గొని సోలిస్ ఐ హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి కంటి సంరక్షణ పై సూచనలు, మందులు కూడా అందజేశారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు రోడ్డు భద్రతను బలోపేతం చేయడంలో, ప్రమాదాలను తగ్గించడంలో మరియు సమాజంలో బాధ్యతాయుత డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పోలీసులు తెలిపారు.

# కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఘన వీడ్కోలు





**కుషాయిగూడ, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ నుండి ఎస్‌ఓటీ మల్కాజిగిరి విభాగానికి బదిలీ అవుతూ వెళ్తున్న ఏఎస్ఐ జి. అశోక్ రెడ్డి మరియు హెడ్ కానిస్టేబుల్ అంబటి సత్యం లకు కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో భావోద్వేగపూరితంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.స్టేషన్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సహచర సిబ్బంది గులాబీ మాలలు, శాలువాలతో సన్మానించి తమ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ ఎల్. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, అశోక్ రెడ్డి మరియు అంబటి సత్యం కుషాయిగూడ పరిధిలో విధి నిర్వహణలో చూపిన క్రమశిక్షణ, కర్తవ్యనిష్ఠ, ప్రజలతో సాన్నిహిత్యం ప్రశంసనీయమని అన్నారు. వారి సేవలు స్టేషన్‌కు మంచి పేరు తీసుకువచ్చాయని పేర్కొన్నారు.ఎస్సైలు సుధాకర్ రెడ్డి, వెంకన్న, సాయిలు, సునీల్ రెడ్డి, విజయ్ తదితరులు మాట్లాడుతూ, ఇద్దరూ సహచరులతో కలిసిమెలిసి పనిచేసి, అనేక కేసుల పరిష్కారంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. వారితో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తుచేసుకుంటూ, కొత్త బాధ్యతల్లో కూడా ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు.బదిలీపై స్పందించిన అశోక్ రెడ్డి మరియు అంబటి సత్యం, కుషాయిగూడలో పనిచేసిన కాలాన్ని స్మరించుకుంటూ, సహచరుల సహకారం ఎప్పటికీ మరిచిపోలేమని అన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.

# ఏదులాపురంలో క్రికెట్ కిక్..

- మార్చి 1 నుంచి పాలేరు స్థాయి పరుగుల పండగ*
- కరుణగిరి యూత్ ఆధ్వర్యంలో క్రీడా సంబరం

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 26(తెలంగాణ ముచ్చట్లు):** పాలేరు నియోజకవర్గ క్రికెట్ ప్రేమికులకు పండుగలాంటి వార్త! ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కరుణగిరి యూత్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. మార్చి 1వ తేదీ నుంచి ఏదులాపురం కరుణగిరిలోని కేంద్రీయ విద్యాలయం రోడ్డు మైదానంలో ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని అద్భుతమైన ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీసేందుకే ఈ మెగా టోర్నీని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎనిమిది ఓవర్ల పోరు

ఈ పోటీలు అత్యంత ఉత్కంఠభరితంగా 8 ఓవర్ల ఫార్మాట్‌లో సాగనున్నాయి. పాలేరు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన జట్లు పాల్గొని తమ సత్తా చాటాలని నిర్వాహక కమిటీ ఆహ్వానం పలుకుతోంది. టోర్నీలో విజేతలుగా నిలిచిన జట్లకు భారీ నగదు పురస్కారాలను ప్రకటించారు. ప్రథమ విజేతకు రూ. 25,000, ద్వితీయ విజేతకు రూ. 15,000 మరియు తృతీయ విజేతకు రూ. 10,000 నగదు బహుమతులు అందజేయనున్నారు.

క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తి

ఈ పోటీలలో పాల్గొనే జట్లు రూ. 799 ఎంట్రీ ఫీజుగా చెల్లించాలని, ప్రతి క్రీడాకారుడు తప్పనిసరిగా గుర్తింపు కార్డు కలిగి ఉండాలని సూచించారు. మ్యాచ్ ప్రారంభానికి 30 నిమిషాల ముందే జట్లు మైదానానికి చేరుకోవాలని, అంపైర్ల నిర్ణయమే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. ఆసక్తి గల జట్లు ఇతర వివరాల కోసం పి. సంపత్ (9912189317), జి. శ్రీకాంత్ (9908858329), నాయుడు (9490025982), పవెల్ (9100545354) నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఏదులాపురం ప్రాంత క్రీడాభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి క్రీడాకారులను ఉత్సాహపరచాలని కరుణగిరి యూత్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.



# ఘనంగాసాయిస్ఫూర్తి కి ఓణీల అలంకరణ వేడుక..

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 26(తెలంగాణ ముచ్చట్లు):** వైరాలోని కామిశెట్టి కళ్యాణమండపం నందు గురువారంసరిపుడి రాము మౌనిక దంపతుల కుమార్తె సాయిస్ఫూర్తికి ఓణీ అలంకరణ వేడుక ఘనంగా నిర్వహించారు అతిథులు బంధువులు స్నేహితులు చిరంజీవి సాయిస్ఫూర్తిని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ టి పి సి సి ప్రధానకార్యదర్శి కట్ల రంగారావు ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ కాప మురళీకృష్ణ తోటకూర శ్రీకాంత్ గంగవరపు కిషన్ రాయి కట్ల నాగరాజు కట్లశ్రీకాంత్ పోలూరి సైదులు పుప్పాల అనంతరామయ్య నల్లమోతు లక్ష్మీనారాయణ మాదినేని దుర్గా ప్రసాద్ సునీత దంపతులు మాదినేని లక్ష్మణరావు నాగరాణి దంపతులు వై బుచ్చి రామారావు శ్రీదేవి దంపతులు తాతయ్య నాయనమ్మ సరిపుడి నరసింహారావు లక్ష్మి అమ్మమ్మ పత్తిపాక లక్ష్మి తదితరులు ఆశీర్వదించారు.



# పేదింటి ఆడబిడ్డలకు 'కళ్యాణ' కానుక

- యామిని కుటుంబానికి లబ్ధి
- చెక్కు పంపిణీ చేసిన తహసీల్దార్, సర్పంచ్

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 26(తెలంగాణ ముచ్చట్లు):** ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వం అందిస్తున్న 'కళ్యాణ లక్ష్మి' పథకం కొండంత అండగా నిలుస్తోందని నేలకొండపల్లి తహసీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజారాంపేట గ్రామానికి చెందిన బండ్ల యామినికి మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కును ఆమె తల్లి బండ్ల తిరుపతమ్మకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి అందజేశారు.

భరోసా కల్పిస్తున్నాం

ఈ సందర్భంగా రాజారాంపేట సర్పంచ్ రాయపూడి రామారావు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సకాలంలో చెక్కు మంజూరు కావడం పట్ల లబ్ధిదారుల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు మధుసూదన్, రమాదేవి, కాంగ్రెస్ నాయకులు చిట్టూరి అచ్చయ్య, బండ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఆస్తమాతో పోరాడి బాలిక మృతి – కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**పెద్దమందడి,ఫిబ్రవరి26(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రంలో విషాదం అలుముకుంది. కొమ్ము నిహారిక (16) అనే బాలిక గత కొంతకాలంగా ఆస్తమా వ్యాధితో బాధపడుతూ మృత్యువుతో పోరాడి నిన్న కన్నుమూసింది.పసిప్రాయంలోనే ఆమె మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు.విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి వెంటనే స్పందించారు. మేఘన్న అభయహస్తం ద్వారా బాధిత కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించి 5000/ వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందించి వారిని పరామర్శించారు.నిహారిక అంత్యక్రియల సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ప్రాంతీయ సభ్యుడు కొమ్ము వెంకటస్వామి, సూర్య రవి, ఉప సర్పంచ్ ఉషన్న యాదవ్, మాజీ మండల పరిషత్ ప్రాంతీయ సభ్యుడు బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు మేస్త్రీ కృష్ణయ్య, పార్థపురం రాములు, మణిగిల్ల కృష్ణయ్య, వెంకటయ్య, బుచ్చన్న, ఆంజనేయులు, గట్టు రాజశేఖర్, జంగం శివ, సాయిబాబా, హనుమంతు, నాగరాజు, నరసింహ, రామచంద్రయ్య, నాగన్న తదితరులు హాజరయ్యారు.తమ కుమార్తెను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న సమయంలో అండగా నిలిచి ఆర్థిక సాయం అందించిన తూడి మేఘా రెడ్డికి నిహారిక కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# డివిజన్‌లో అభివృద్ధి పనులపై మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పర్యటన



**వినాయక నగర్, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి నియోజకవర్గం వినాయక నగర్ డివిజన్ పరిధిలో కాలనీ వాసుల ఫిర్యాదుల మేరకు మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పలు ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. వినాయక్ నగర్ లైన్ నెంబర్-17లో డ్రైనేజీ సమస్య కారణంగా రోడ్డుకు అంతరాయం కలిగిన విషయాన్ని ఆమె పరిశీలించారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులతో మాట్లాడి, వెంటనే పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.అలాగే రేణుక నగర్‌లో బాక్స్ డ్రైన్ పనులు పూర్తయ్యినప్పటికీ వాటర్ లైన్ పనులు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో అధికారులతో మాట్లాడి నేడు నుంచే వాటర్ లైన్ పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. అనంతరం జేక్ కాలనీలో నూతనంగా జరుగుతున్న రోడ్ పనులను పరిశీలించి, పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రజలకు దీర్ఘకాల ప్రయోజనం కలిగేలా పనులు జరగాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, కాలనీ వాసులు, బీజేపీ నాయకులు ఓం ప్రకాష్, సాయి సురేష్, జగదీష్ చారి తదితరులు పాల్గొన్నారు.



# నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి



- డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలి
- వామపక్షాలు డిమాండ్
- బాధితులకు పరామర్శ - కలెక్టర్కు వినతి

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 26(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం పట్టణంలో వెలుగు మట్ల ప్రాంతంలో ఇండ్ల కూల్చివేతలో నిర్వాసితులైన వారందరికీ వెంటనే పునరావాసం కల్పించాలని, ప్రత్యామ్నాయం నివాసం ఏర్పాటు చేసేంత వరకు పునరావాస కేంద్రాలు నిర్వహించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెలుగు మట్లలోని ఇండ్లను కూల్చడం తొందరపాటు చర్య అని యుద్ధ రంగాన్ని తలపించే రీతిలో పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించి భయోత్పాతం సృష్టించాల్సిన అవసరం లేదని వారు తెలిపారు. గురువారం అంబేడ్కర్ భవన్లో ఉన్న వెలుగుమట్ల నిర్వాసితులను పరామర్శించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెలుగు మట్ల ప్రాంతంలో వామపక్షాల నాయకులు పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. వామపక్షల నేతల ముందు బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి తక్షణ సాయంగా లక్ష రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు. భూదాన్ భూమిలో ఆశ్రయం ఏర్పాటు చేసుకుని నివసిస్తున్న 600 కుటుంబాలకు సంబంధించిన రెండు వేల మంది జీవిస్తున్నారని వారందరికి ఎటువంటి హెచ్చరికలు లేకుండా బుల్ డోజర్లతో విరుచుకుపడి కూల్చివేశారని ఇది ఒక అమానుష ఘటన అని వామపక్షాల నేతలు తెలిపారు. యంత్రాలతో కూల్చివేతలు జరిగాయని పిల్లలు, వృద్ధులు, మహిళలు అనే విచక్షణ లేకుండా బయటకు గెంటివేశారని వారు తెలిపారు. అంతే కాకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించిన వారిపై అక్రమ కేసులు నమోదు చేశారని వారు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఇండ్ల కూల్చివేతకు గురైన కుటుంబాలకు ఎటువంటి షరతులు లేకుండా అదే స్థలంలో డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని నిర్వాసితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తిరిగి వసతి కల్పించేంత వరకు నిర్వాసితులకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) మాస్లైన్ జిల్లా కార్యదర్శులు దండి సురేష్, నున్నా నాగేశ్వరరావు, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సిపిఐ నాయకులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సీతామహలక్ష్మి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, సాంబశివారెడ్డి, తాటి నిర్మల, గాదె లక్ష్మి నారాయణ, శ్రావణ్, చింతల రమేష్, సిపిఎం నాయకులు మాచర్ల భారతి, వై. విక్రం, యర్రా శ్రీనివాస్, మాస్లైన్ నాయకులు సివై పుల్లయ్య, వై. ప్రకాష్, శిరోమణి, ఝాన్సీ, వివిధ పార్టీల నాయకులు బషీర్, మస్తాన్, శ్రీకాంత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



# కాప్రా ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక





- అధ్యక్షుడిగా జ్యోతిర్మయ చారి, ప్రధాన కార్యదర్శిగా ఆదిమూలం శ్రీనివాస్

**కాప్రా, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కాప్రా ప్రెస్ క్లబ్ (ప్రింట్ మీడియా సీనియర్ జర్నలిస్టుల సంఘం రిజిస్టర్ నం. 489/2020) నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో నిర్వహించిన సమావేశంలో సీనియర్ జర్నలిస్టుల సమక్షంలో నూతన కమిటీని ఎంపిక చేశారు.అధ్యక్షుడిగా జ్యోతిర్మయ చారి (వార్త చారి), ప్రధాన కార్యదర్శిగా ఆదిమూలం శ్రీనివాస్ (సాక్షి), కోశాధికారిగా వట్టిపల్లి సురేష్ (జనం సాక్షి) ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, ఎస్సై సుధాకర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.నూతన కమిటీ సభ్యులు జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు.తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన తోటి జర్నలిస్టులందరికీ నూతన కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని వారు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సలహాదారులు కడియాల రమేష్ (నమస్తే తెలంగాణ), కె.సి. మోహన్ (నమస్తే తెలంగాణ), చంద్రమౌళి (ఈనాడు), క్యాసని సత్యనారాయణ సాగర్ (నవతెలంగాణ), సహదేవా చారి (ఆంధ్రజ్యోతి), ఉల్లోజు శ్రీనివాస్ (ఆంధ్రప్రభ)తో పాటు సీనియర్ జర్నలిస్టులు భాస్కర్ రెడ్డి, గడ్డమీది బాలరాజ్ గౌడ్, సిరా శ్రీనివాస్, విజయ్, శంకర్, లక్కిడి బాల్ రెడ్డి, పలుగుల పవన్, అనిల్, సాంబశివుడు, సురేందర్, నర్సింగ్ గౌడ్, ప్రసాద్, రోజా రాణి, రాము తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల విందుగ ధ్వజస్తంభం ప్రతిష్ట... మహా అన్నదానం..





- పసుపు కుంకుమలతో గ్రామ మహిళలు..
- వేద పండితుల పురోహితులతో గురుపూజోత్సవం ..
- తండోపతండాలుగా భక్తజనం..

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 26(తెలంగాణ ముచ్చట్లు):** వైరా మండలం కేజీ సిరిపురం గ్రామంలో గురువారం అంగరంగ వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట వేద పండితుల, పురోహితుల మంత్రోచ్ఛరణతో ప్రతిష్ట జరిగింది. ఈ ప్రతిష్టకు సిరిపురం భక్త ప్రజానికమే కాకుండ చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా వచ్చి వారి ముక్కులను తీర్చుకోవటం జరిగింది. దాదాపుగా 4000 వేల నుంచి 5 వేల దాకా భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమన్నారాయణ హనుమాన్ గోషాలను 23 గోవులతో సిరిపురంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ గోశాల ఖమ్మం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచి భారత్ కేంద్ర ప్రభుత్వం చే గుర్తింపు పొందిన గోశాలగా ఖ్యాతినుంది. శ్రీమన్నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గో సంరక్షణ ధర్మ బద్ధకంగా ఉన్నదని శ్రీమన్నారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం, కందిబండ కుటుంబ సభ్యులు, వైరా మండల అర్చకుల కమిటీ సభ్యులు, సిరిపురం గ్రామ సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, నేలకొండపల్లి మండలం మద్రాజుపల్లి సర్పంచ్ రావూరి కోటేశ్వరరావు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సర్పంచ్ బిల్లా యాదగిరి





**వేలేరు,ఫిబ్రవరి 26(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానిక ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్య తీవ్రతను గుర్తించిన సర్పంచ్ వెంటనే స్పందించి విషయాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు.


ఎమ్మెల్యే సహకారంతో ప్రహరీ గోడ నిర్మాణానికి రూ. 22 లక్షలు మంజూరయ్యాయి. మంజూరైన నిధులతో పనులకు శంకుస్థాపన చేసి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. గ్రామ సమస్యలు తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పారదర్శక పరిపాలనతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో శాలపల్లె గ్రామ సర్పంచ్ కూరపాటి అశోక్, లోక్యతండా గ్రామ సర్పంచ్ సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంపత్, ఉప సర్పంచ్ శ్రీకర్, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, మండల ఏపీవో, పీఆర్ ఏఈ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు, వార్డు సభ్యులు ప్రశాంత్, ప్రవళిక, చైతన్య, సురేష్, సునీలు, గ్రామ పెద్దలు, యువజన సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆటిజం, పిల్లల అభివృద్ధి కేంద్రాలందుకు నమోదు తప్పనిసరి

- చట్టం 2016 ప్రకారం జిల్లా సంక్షేమ అధికారి హెచ్చరిక

**మేడ్చల్-మల్కాజ్‌గిరి, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా సంక్షేమ అధికారికులచే విడుదల చేసిన అధికారిక ప్రకటనలో, ఆటిజం సేవలు, పిల్లల అభివృద్ధి కార్యకలాపాలు నిర్వహించే అన్ని సంస్థలు దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 (వికలాంగుల హక్కుల చట్టం, 2016) ప్రకారం తప్పనిసరిగా సంబంధిత అధికారుల వద్ద నమోదు చేసుకోవవలసిన అవసరం ఉందని తెలియజేశారు.జిల్లా వర్తమానాల ప్రకటన ప్రకారం, జిల్లాలో కొన్ని ఆటిజం సేవా కేంద్రాలు మరియు అభివృద్ధి కేంద్రాలు సంబంధిత అధికారుల నుండి కావాల్సిన నమోదు పొందకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించబడింది. ఇది చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘిస్తున్నందున, అటువంటి కేంద్రాలన్నీ వెంటనే మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో నమోదు కోసం దరఖాస్తు చేయాలని అధికారస్తులు ఆదేశించారు. చట్టంలోని నిబంధనలను పాటించకపోతే సంబంధిత సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులు వెల్లడించారు. వాటిలో కేంద్రాల మూసివేత మరియు అవసరమైతే ప్రభుత్వం ద్వారా స్వాధీనం వంటి అంగీకృత చర్యలు కూడా ఉంటాయని హెచ్చరించారు. జిల్లా సంక్షేమ అధికారులు పేర్కొనగా, "సర్వత్రా సేవల నాణ్యతను పెంచడం, వికలాంగుల హక్కులను మరింతగా కాపాడటం, పరిరక్షణను ఎక్కువగా అందించడం అనేది ముఖ్య లక్ష్యం. అందువల్ల, చట్టబద్ధంగా నమోదవ్వని కేంద్రాలపై రగడ చర్యలు తప్పనిసరి," అని చెప్పారు.ప్రకటనలో సంబంధిత ఆటిజం, పిల్లల అభివృద్ధి సంస్థలకు ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి తుదితేదీకాకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# అంగరంగ వైభవంగా శ్రీవిద్య,సుధాకర్‌ల నిశ్చితార్థ వేడుక

- నూతన వధూవరులను ఆశీర్వదించిన ఆర్డీఓలు రమేష్ రాథోడ్,వెంకన్న
- నూతన జంటకు శుభాకాంక్షలు తెలిపిన పలు కుల సంఘాల,
- రాజకీయా నాయకులు

**హనుమకొండ,ఫిబ్రవరి26(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ ఉషోదయ కాలనీ రోడ్ నెంబర్ 17లో శ్రీవిద్య-సుధాకర్ ల నిశ్చితార్థ వేడుక గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. లావుడియా విజయ హేమ నాయక్ కుమార్తె శ్రీవిద్య, గుగులోతు మంజుల సుందర్ కుమారుడు సుధాకర్ నిశ్చితార్థం సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమానికి హనుమకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్, ఘన్పూర్ ఆర్డీవో డిఎస్ వెంకన్న, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి ఎన్ నాయక్, వేలేరు ఎమ్మార్వో కోమి ,తెలంగాణ ముచ్చట్లు బొల్లెపాక సీఈవో రాజేష్,రాజు నాయక్ తదితరులు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.వివిధ రాజకీయ పార్టీ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, వివిధ శాఖల సిబ్బంది హాజరై శ్రీవిద్య-సుధాకర్ దంపతులకు భవిష్యత్తు సుఖశాంతులతో నిండాలని ఆకాంక్షించారు. వేడుకను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అలాగే రెవెన్యూ శాఖకు చెందిన తారాబాయి, లావుడియా శారద, రాము నాయక్, బాలు నాయక్, చాందీ దాసు నాయక్, విజయ రఘురాం, వనిత గోవర్ధన్, కళ్యాణ్, శ్రవణ్ కుమార్, విజయ హేమ నాయక్, శ్రీకాంత్, లంబాడ లైవ్ ఐక్య వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్, జీవన శ్రీ, సెవాగ్, సునీత, సునీల్, కల్పన గోపాల్, కిషన్ నాయక్, వెంకన్న, రవి, అమ్రు నాయక్, రాజారాం, గులాబ్ సింగ్, రవినాథ్, ధరమ్ సింగ్, రాహుల్, వెంకటేష్, నారాయణ సింగ్, జట్ మాల్, ప్రమోద్, బాలాజీ, జైపాల్, ఆనంద్ రవి నాయక్, రజిత, రాజన్న, వసంత చీమన్ నాయక్, మమత, సరిత, సునీత హనుమంతు, వేణు, కిరణ్, గణేష్, సంతోష్, సంజీవ్, సందీప్, ఉదయ్ సింగ్, చీమన్ నాయక్, గణపతి, కరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.







# బాలసముద్రంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

## ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజానికి ఐక్యతకు నాంది: కడియం కావ్య

**హన్మకొండ,ఫిబ్రవరి26(తెలంగాణ ము-చ్చట్లు):** బాలసముద్రం, ఏకశిలా పార్కు సమీపంలోని శ్రీ సీతారామచంద్ర ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న ద్విపుష్కర ప్రయుక్త పట్టాభిషేకోత్సవాత్మక పంచాహ్నిక పుష్కర బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పుష్పయాగ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా మాట్లాడిన ఆమె, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యత, సద్భావనలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆరోగ్యం, సమృద్ధి చేకూరాలని ఆకాంక్షించారు. సంప్రదాయ ఉత్సవాలను తరతరాలకు నిలుపుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవి, ఆలయ కమిటీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు స్వాతి, ఉమా తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజల్లో భాగస్వాములయ్యారు.

# ఉప్పల్ మీడియా క్లబ్ నూతన కమిటీకి ఘన సత్కారం

- సేవా కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



**ఉప్పల్, ఫిబ్రవరి 26 (తెలంగాణ ముచ్చట్లు-):** ఉప్పల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి ఉప్పల్ మీడియా క్లబ్ (ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ) నూతన కమిటీ సభ్యులను గురువారం తన నివాసంలో ఆహ్వానించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి భవిష్యత్ కార్యాచరణకు తన మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, సుమారు 35 సంవత్సరాల తరువాత ఉప్పల్‌లో సీనియర్ జర్నలిస్టు వడ్డేపల్లి కిషోర్ నాయకత్వంలో తొలిసారిగా ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులు ఐకమత్యంతో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నూతన కమిటీ సభ్యులు స్నేహబంధంతో, సమన్వయంతో ముందుకు సాగుతూ మీడియా ప్రతిష్ఠను మరింత పెంచాలని ఆకాంక్షించారు.కమిటీకి అవసరమైన సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం వద్ద తాను కృషి చేస్తానని తెలిపారు. మీడియా నిష్పక్షపాత ధోరణితో ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.మీడియా క్లబ్ చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలకు తన సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని బేతి సుభాష్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో ఉప్పల్ బీజేపీ అధ్యక్షుడు మారినేని ఫణిందర్, ప్రధాన కార్యదర్శి తీగ విట్టల్ రావు మరియు ఉప్పల్ మీడియా క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మార్కెట్‌ను షేక్ చేస్తున్న 5 ఎలక్ట్రిక్ బైక్‌లు

దేశవ్యాప్తంగా విద్యుత్ వాహనాల విప్లవం వేగంగా ముందుకు సాగుతోంది. ఇంధన ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సాధారణ ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్‌తో నడిచే ద్విచక్ర వాహనాలు యువతతో పాటు ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, పట్టణ ప్రయాణికుల మధ్య విశేష ఆదరణ పొందుతున్నాయి. ప్రారంభ దశలో స్కూటర్లు ఎక్కువగా కనిపించగా, ఇప్పుడు శక్తివంతమైన విద్యుత్ మోటార్‌సైకిళ్లు కూడా మార్కెట్‌లో ప్రవేశించి ఆకట్టుకుంటున్నాయి. అధునాతన సాంకేతిక సౌకర్యాలు, ఆకర్షణీయ రూపకల్పన, తక్కువ నిర్వహణ వ్యయం, ఒక్కసారి చార్జ్‌తో ఎక్కువ దూరం ప్రయాణించే సామర్థ్యం వీటి ప్రధాన ఆకర్షణలు. ముఖ్యంగా 200 కి.మీ.లకు పైగా ప్రయాణించగల సామర్థ్యంతో కొన్ని బైక్‌లు వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రస్తుతం మార్కెట్‌లో హవా కొనసాగిస్తున్న ఐదు విద్యుత్ బైక్‌ల వివరాలు ఇవి. మొదటిగా ఒబెన్ రోర్ ఈజెడ్ సిగ్మా వినియోగదారులను ఆకట్టుకుంటోంది. గరిష్టంగా గంటకు 95 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగల ఈ బైక్ కేవలం కొన్ని సెకన్లలోనే వేగం అందుకుంటుంది. ఒక్కసారి పూర్తిగా చార్జ్ చేస్తే సుమారు 175 కిలోమీటర్ల వరకు ప్రయాణించగల సామర్థ్యం కలిగి ఉంది. ఆధునిక డిజిటల్ ప్రదర్శన ప్యానెల్, అంతర్నిర్మిత మార్గదర్శక వ్యవస్థ, కాల్ సందేశ సూచనలు, దూర నియంత్రణ సౌకర్యాలు వంటి అనేక సాంకేతిక లక్షణాలు ఇందులో అమర్చబడ్డాయి. వేగవంతమైన చార్జింగ్ సౌకర్యంతో తక్కువ సమయంలోనే శక్తిని నింపుకోవచ్చు. ధర పరంగా మధ్యతరగతి వినియోగదారులకు అందుబాటులో ఉండటం దీని ప్రత్యేకత. రెండవ స్థానంలో అతినీలలోహిత యూవీ ఎక్స్ నలభైఏడు నిలుస్తోంది. శక్తివంతమైన బ్యాటరీ వ్యవస్థతో రూపొందించిన ఈ మోడల్ ఒక్కసారి చార్జ్ చేస్తే సుమారు 211 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు. భద్రతా పరంగా ఆధునిక బ్యాటరీ నిర్వహణ వ్యవస్థ, పునరుత్పత్తి బ్రేకింగ్ విధానం, బహుళ రైడ్ విధానాలు ఇందులో ఉన్నాయి. రూపకల్పన పరంగా కూడా ఈ బైక్ యువతను ఆకర్షించే విధంగా రూపొందించబడింది. ప్రారంభ ధర కొంత ఎక్కువైనా, అందించే సౌకర్యాల దృష్ట్యా ఇది ప్రీమియం వర్గానికి చెందినదిగా చెప్పవచ్చు. మూడవగా రివోల్ట్ ఆర్వీ వన్ బ్లేజ్ ఎక్స్ వినియోగదారుల మన్ననలు పొందుతోంది. లిథియం అయాన్ బ్యాటరీ సాంకేతికతతో పనిచేసే ఈ వాహనం ఒక్కసారి చార్జ్ చేస్తే సుమారు 150 కిలోమీటర్ల పరిధి అందిస్తుంది. నగర ప్రయాణాలకు అనువుగా రూపొందించిన ఈ బైక్‌లో మూడు ప్రయాణ విధానాలు, డిజిటల్ కన్సోల్, దొంగతన నిరోధక హెచ్చరిక వ్యవస్థ, భౌగోళిక పరిమితి గుర్తింపు వంటి సౌకర్యాలు ఉన్నాయి. సరసమైన ధరతో అందుబాటులో ఉండటం దీని ప్రధాన బలం. నాలుగవ స్థానంలో ఓలా రోడ్‌స్టర్ ఎక్స్ శ్రేణి ఉంది. మూడు వేరియంట్లలో లభ్యమయ్యే ఈ బైక్ గరిష్టంగా 252 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని సంస్థ ప్రకటించింది. గరిష్ట వేగం గంటకు 118 కిలోమీటర్ల వరకు ఉంటుంది. బలమైన సస్పెన్షన్ వ్యవస్థ, ముందువైపు దూరదర్శక ఫోర్కులు, వెనుక భాగంలో ద్వంద్వ షాక్ వ్యవస్థ, ఏకఛానల్ నిరోధక బ్రేకింగ్ వ్యవస్థ వంటి లక్షణాలు భద్రతను పెంచుతున్నాయి. ధర పరంగా ఇది విస్తృత శ్రేణిలో లభ్యమవుతుండటంతో ఎక్కువమంది వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. ఐదవగా మ్యాటర్ ఏరా ఐదు వేల ప్రత్యేక గుర్తింపు పొందింది. దేశంలోనే మొట్టమొదటి గేర్ వ్యవస్థ కలిగిన విద్యుత్ మోటార్ సైకిల్‌గా ఇది గుర్తింపు పొందింది. శక్తివంతమైన మోటార్, నాలుగు వేగ గేర్ వ్యవస్థ, ఆధునిక బ్యాటరీ నిర్వహణ సాంకేతికతతో ఇది సుమారు 125 కిలోమీటర్ల పరిధి అందిస్తుంది. స్పర్శాధారిత పెద్ద ప్రదర్శన ప్యానెల్, బ్లూటూత్ అనుసంధానం, మార్గదర్శక వ్యవస్థ, ప్రయాణ విశ్లేషణ వంటి అనేక సాంకేతిక సౌకర్యాలు ఇందులో ఉన్నాయి. ధర పరంగా కొంత ఎక్కువైనా ప్రత్యేకతల కారణంగా ఇది ప్రత్యేక వర్గ వినియోగదారులను ఆకర్షిస్తోంది.

# విండీస్ చిత్తు.. సౌతాఫ్రికా ఘన విజయం

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 సూపర్ 8 దశలో భాగంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన కీలక పోరులో దక్షిణాఫ్రికా జాతీయ క్రికెట్ జట్టు ఘన విజయాన్ని నమోదు చేసింది. వెస్టిండీస్ జాతీయ క్రికెట్ జట్టు నిర్దేశించిన 177 పరుగుల లక్ష్యాన్ని కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 16.1 ఓవర్లలోనే ఛేదించి 9 వికెట్ల తేడాతో సునాయాసంగా గెలిచింది. ఈ విజయంతో దక్షిణాఫ్రికా జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుని తమ సెమీఫైనల్ ఆశలను మరింత బలపరిచింది.

టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. ప్రారంభంలోనే కొన్ని వికెట్లు కోల్పోయినప్పటికీ మధ్య వరుసలో షెఫర్డ్ అర్ధశతకంతో జట్టును గౌరవప్రదమైన స్కోరుకు చేర్చాడు. హోల్డర్ కూడా సమయోచితంగా ఆడి కీలక పరుగులు సాధించాడు. అయితే దక్షిణాఫ్రికా బౌలర్లు క్రమశిక్షణతో బౌలింగ్ చేస్తూ పరుగులను నియంత్రించారు. ఎంగిడి మూడు వికెట్లు సాధించగా, రబాడా మరియు బోష్ తలో రెండు వికెట్లు తీసి విండీస్‌పై ఒత్తిడి పెంచారు.

177 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా జట్టు ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ వేగంగా పరుగులు సాధించి మంచి ఆరంభాన్ని అందించాడు. అతని అవుట్ తర్వాత కెప్టెన్ ఐడెన్ మార్‌క్రమ్ మరింత దూకుడు ప్రదర్శిస్తూ అద్భుత అర్ధశతకం సాధించాడు. కేవలం 46 బంతుల్లోనే 82 పరుగులు చేసి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. ర్యాన్ రికెల్టన్ కూడా అజేయంగా నిలిచి మ్యాచ్‌ను ముగించాడు.

వెస్టిండీస్ బౌలర్లు వికెట్లు దక్కించుకునేందుకు తీవ్రంగా శ్రమించినప్పటికీ, దక్షిణాఫ్రికా బ్యాటర్ల ధాటికి వారు తట్టుకోలేకపోయారు. రోస్టన్ ఛేజ్ మాత్రమే ఒక వికెట్ సాధించగలిగాడు. మిగతా బౌలర్లు పరుగులను అదుపు చేయడంలో విఫలమయ్యారు.

మొత్తంగా ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా సమగ్ర ప్రదర్శన కనబరిచింది. బౌలింగ్‌లో కట్టుదిట్టత, బ్యాటింగ్‌లో దూకుడు కలగలిపి ప్రత్యర్థిపై ఆధిపత్యం చాటింది. సూపర్ 8 దశలో వరుస విజయాలతో ప్రొటీస్ జట్టు టైటిల్ దిశగా ధైర్యంగా అడుగులు వేస్తోంది. ఇక వెస్టిండీస్ మాత్రం తమ తదుపరి మ్యాచ్‌ల్లో గెలిచి పుంజుకోవాల్సిన అవసరం ఉంది.




# భారత్ ఘన విజయం..
# సెమీస్ ఆశలు సజీవం..?









ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో మస్ట్‌గా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ జాతీయ క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనతో ఘన విజయం సాధించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన ఈ కీలక పోరులో జింబాబ్వే జాతీయ క్రికెట్ జట్టుపై సమగ్ర ఆధిపత్యం చాటింది. తొలుత బ్యాటింగ్‌లో పరుగుల వర్షం కురిపించిన టీమిండియా, అనంతరం కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని 184 పరుగులకు పరిమితం చేసి సెమీఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. అయితే భారీ విజయమే సాధించినప్పటికీ నెట్ రన్ రేట్ విషయంలో ఆశించినంత లాభం దక్కలేదు.

టాస్ గెలిచిన జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. ఈ నిర్ణయాన్ని భారత ఓపెనర్లు పూర్తిగా తప్పుగా నిరూపించారు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సంజు శాంసన్, అభిషేక్ శర్మ జట్టుకు బలమైన పునాది వేశారు. అభిషేక్ శర్మ 55 పరుగులతో మెరిశాడు. మధ్య వరుసలో సూర్యకుమార్ యాదవ్ వేగవంతమైన ఇన్నింగ్స్ ఆడగా, చివర్లో హార్దిక్ పాండ్యా అజేయ అర్ధశతకంతో చెలరేగాడు. తిలక్ వర్మ కూడా చివరి ఓవర్లలో ధాటిగా ఆడి జట్టును 20 ఓవర్లలో 4 వికెట్లకు 256 పరుగుల భారీ స్కోరుకు చేర్చాడు.జింబాబ్వే బౌలర్లు భారత బ్యాటర్ల ధాటికి తట్టుకోలేకపోయారు. నలుగురు బౌలర్లు తలో వికెట్ సాధించినప్పటికీ పరుగుల ప్రవాహాన్ని అడ్డుకోలేకపోయారు.

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే ప్రారంభంలోనే ఒత్తిడికి గురైంది. భారత బౌలర్లు క్రమశిక్షణతో బంతులు వేస్తూ వికెట్లు సాధించారు. జస్ప్రీత్ బుమ్రా తన ఖచ్చితమైన లైన్తో ఒత్తిడి సృష్టించగా, అర్ష్‌దీప్ సింగ్ కీలక వికెట్లు తీశాడు. వరుణ్ చక్రవర్తి తన మాయాజాలంతో మధ్య వరుసను కట్టడి చేశాడు. సికందర్ రజా, ర్యాన్ బర్ల్ ప్రయత్నించినప్పటికీ భారత బౌలింగ్ దాడిని ఎదుర్కొనలేకపోయారు. నిర్ణీత 20 ఓవర్లలో జింబాబ్వే 184 పరుగులకే పరిమితమైంది. దీంతో భారత్ ఘన విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో గ్రూప్ దశలో భారత్ పాయింట్లు పెంచుకుని సెమీఫైనల్ రేసులో నిలిచింది.

అయితే సెమీస్ సమీకరణాలు ఇంకా పూర్తిగా స్పష్టత పొందలేదు. ఇతర జట్ల ఫలితాలు, నెట్ రన్ రేట్ అంశాలు కూడా కీలకంగా మారనున్నాయి. అయినప్పటికీ ఈ మ్యాచ్‌లో భారత్ చూపిన సమగ్ర ప్రదర్శన అభిమానుల్లో నమ్మకాన్ని పెంచింది. బ్యాటింగ్‌లో దూకుడు, బౌలింగ్‌లో క్రమశిక్షణ, ఫీల్డింగ్‌లో చురుకుదనం రకాలుగా జట్టు మెరుగైన ఆటతీరు కనబర్చింది. మొత్తంగా చూస్తే, ఒత్తిడిని జయిస్తూ భారత్ కీలక విజయాన్ని సాధించింది. ఇక మిగిలిన మ్యాచ్‌ల ఫలితాలపై దృష్టి సారిస్తూ సెమీఫైనల్ బెర్త్ కోసం ఎదురుచూస్తోంది. అభిమానులు కూడా జట్టు ఇదే జోరును కొనసాగిస్తుందని ఆశాభావంతో ఉన్నారు.



# వివాహ బంధంతో ఒక్కటైన విజయ్ – రష్మిక

టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహ బంధంతో ఒక్కటయ్యారు. సంప్రదాయ పెళ్లి వేడుకకు సంబంధించిన అందమైన ఫోటోలను ఈ జంట సోషల్ మీడియాలో పంచుకోవడంతో అవి క్షణాల్లో వైరల్ అయ్యాయి. అభిమానులు, సినీ ప్రముఖులు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. రష్మికతో కలిసి 'కాక్‌టెయిల్ 2' సినిమాలో నటిస్తున్న కృతి సనన్ ఈ జంటకు ప్రత్యేకంగా, భావోద్వేగంతో కూడిన శుభాకాంక్షలు తెలిపారు. పెళ్లి ఫోటోను పంచుకుంటూ "ఈ ఫ్రేమ్‌లో ఎంత ప్రేమ, ఆనందం నిండిపోయిందో. మీ జీవితాంతం అందమైన జ్ఞాపకాలతో నిండిపోవాలి" అని ఆకాంక్షించారు. మరో పోస్టులో రష్మిక స్వచ్ఛమైన మనసున్న వ్యక్తి అని ప్రశంసిస్తూ, అన్ని సంతోషాలకు అర్హురాలని పేర్కొన్నారు. స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు కూడా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభినందనలు తెలిపారు. నటి రకుల్ ప్రీత్ సింగ్ "మీ హృదయాలు ఎప్పుడూ కలిసే ఉండాలి" అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. రష్మికతో కలిసి 'తమ్మ' సినిమాలో నటించిన ఆయుష్మాన్ ఖురానా "హృదయపూర్వక అభినందనలు" అని కామెంట్ చేశారు. వీరితో పాటు నేహా ధూపియా, ఇషాన్ ఖట్టర్, భూమి పెడ్నేకర్, మౌనీ రాయ్ వంటి పలువురు బాలీవుడ్ ప్రముఖులు కూడా ఈ జంటకు విషెస్ తెలిపారు. విజయ్-రష్మికల కొత్త జీవిత ప్రయాణానికి సినీ పరిశ్రమ నుంచి అభినందనల వెల్లువ కొనసాగుతోంది.



# టాలీవుడ్‌లో నవశకం.. కంటెంట్‌కు కిరీటం కట్టిస్తున్న యువ నిర్మాతలు

తెలుగు సినీ పరిశ్రమలో యువ నిర్మాతల జోరు స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం పెట్టుబడులు పెట్టడం మాత్రమే కాకుండా, కథా ఎంపికలోనూ కొత్త దారులు తీస్తూ పరిశ్రమ రూపురేఖలను మార్చేస్తున్నారు. ముఖ్యంగా మెగా కుటుంబానికి చెందిన నిహారిక కొణిదెల నిర్మాతగా తనదైన ముద్ర వేస్తున్నారు. ఆమె స్థాపించిన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పదేళ్లు పూర్తి చేసుకోవడం ఈ సందర్భంగా ప్రత్యేకంగా నిలిచింది. 'ముద్దపప్పు ఆవకాయ్' వెబ్ శ్రేణి నుంచి కమిటీ కుర్రోళ్లు వరకు ఆమె నిర్మించిన కంటెంట్ ప్రేక్షకాదరణ పొందింది. ప్రస్తుతం సంగీత్ శోభన్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకాస' చిత్రంతో ఆమె మరింత వేగంగా ముందుకు సాగుతున్నారు. భవిష్యత్తులో వరుణ్ తేజ్ తోనూ ఓ చిత్రం చేయనున్నట్లు సమాచారం.

ఇక యువ నిర్మాత వంశీ నందిపాటి కూడా పరిశ్రమలో తనదైన శైలిని చూపిస్తున్నారు. నిర్మాతగానే కాకుండా పంపిణీదారుడిగానూ రాణిస్తూ, తక్కువ కాలంలోనే విభిన్న కథాంశాల చిత్రాలను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. 'రాజు వెడ్స్ రాంభాయ్', 'లిటిల్ హార్ట్స్', 'ఈషా', 'మిత్రమండలి', 'శ్రీ చిదంబరం గారు', 'హే బలవంత్' వంటి చిత్రాల విడుదలలో కీలక పాత్ర పోషించారు. త్వరలో 'సంప్రదాయని సుప్పిని సుద్దపూసని' అనే ఆసక్తికరమైన చిత్రాన్ని విడుదలకు సిద్ధం చేస్తున్నారు.

షైన్ స్క్రీన్స్ అధినేత సాహు గారపాటి వరుస విజయాలతో అభిరుచి గల నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు. ఇటీవల విడుదలైన 'మన శంకరవరప్రసాద్ గారు' విజయంతో మంచి ఊపులో ఉన్నారు. మరోవైపు ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నిరంజన్ రెడ్డి హనుమాన్ ద్వారా దేశవ్యాప్తంగా సంచలన విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు 'సంబరాల ఏటిగట్టు' అనే విభిన్న కథను నిర్మిస్తున్నారు.

అలాగే లెజెండరీ నిర్మాత అశ్వినీ దత్ కుమార్తెలు స్వప్న దత్, ప్రియాంక దత్ తమ వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్ బ్యానర్ల ద్వారా 'మహానటి', 'జాతిరత్నాలు', 'సీతారామం' వంటి విజయాలతో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు.

ఇక స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ తరపున రాహుల్ యాదవ్ నక్కా తీసిన ప్రయోగాత్మక చిత్రాలు పరిశ్రమకు కొత్త ఊపును అందిస్తున్నాయి. 'మళ్లీ రావా', 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ', 'మసూద' వంటి విభిన్న కథాంశాలతో వాణిజ్యవిజయాలు సాధించారు. మొత్తంగా చూస్తే, నేటి యువ నిర్మాతలు కంటెంట్‌కే ప్రాధాన్యత ఇస్తూ కొత్త దర్శకులు, నటీనటులను ప్రోత్సహిస్తున్నారు. డిజిటల్ ప్రచార పద్ధతులను అనుసరిస్తూ ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తున్నారు. ఒకప్పుడు నిర్మాణం అంటే కేవలం భారీ బడ్జెట్ అనుకునే కాలం పోయింది. ఇప్పుడు మంచి కథే రాజు అన్న నమ్మకంతో టాలీవుడ్‌లో కొత్త శకం ఆరంభమైందని చెప్పవచ్చు.

# 'ది కేరళ స్టోరీ 2' విడుదల నిలిపివేత.. హైకోర్టు ఆగ్రహం




బాలీవుడ్‌లో రూపొందిన వివాదాస్పద చిత్రం ది కేరళ స్టోరీ 2 విడుదలపై కేరళ హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. ఫిబ్రవరి ఇరవై ఏడవ తేదీన చిత్రం విడుదల కావాల్సి ఉండగా, విడుదలకు ఒక్కరోజు ముందు కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

సెన్సార్ ధ్రువీకరణ ఇచ్చే ప్రక్రియలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ తన విచక్షణను సముచితంగా వినియోగించలేదని ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. మత సంబంధ అంశాలు, సామాజిక సామరస్యానికి భంగం కలిగించే విషయాలపై పాటించాల్సిన మార్గదర్శకాలను పూర్తిగా పరిశీలించకుండానే సర్టిఫికేట్ మంజూరు చేసినట్లు కోర్టు అభిప్రాయపడింది.

ఈ చిత్రం కేరళ రాష్ట్రాన్ని ప్రతికూలంగా చిత్రీకరిస్తోందని, తప్పుడు ప్రచారంతో మతాల మధ్య విభేదాలు రేకెత్తించే అవకాశం ఉందని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. కేరళ పేరును వినియోగిస్తూ రాష్ట్రానికి సంబంధం లేని కథను చూపించడం కూడా ఆందోళనకరమని కోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ బెచు కురియన్ థామస్ కేరళ రాష్ట్రం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందని, అయితే ఈ చిత్రం ద్వారా విపరీతమైన సంకేతాలు వెలువడుతున్నాయని వ్యాఖ్యానించినట్లు సమాచారం.

ఈ నేపథ్యంలో చిత్రానికి ఇచ్చిన ధ్రువీకరణను మరోసారి సమగ్రంగా పరిశీలించాలని, పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని సెన్సార్ బోర్డును కోర్టు ఆదేశించింది. మరోవైపు, సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టే ఉత్తర్వులను సవాలు చేస్తూ చిత్ర నిర్మాతలు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# 'ఆయా షేర్' హుక్ స్టెప్‌పై వివాదం





ది ప్యారడైజ్ చిత్రంలోని 'ఆయా షేర్' పాట విడుదలైన కొద్ది గంటల్లోనే సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. నాని జన్మదిన సందర్భంగా విడుదల చేసిన ఈ ఉత్సాహభరిత గీతం అభిమానులను ఆకట్టుకుంటుండగా, ఇప్పుడు అదే పాట హుక్ స్టెప్‌పై కాపీ ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. పాటలో నాని వేసిన ఉత్సాహభరిత నృత్య భంగిమ ప్రేక్షకులను ఆకర్షించగా, ఆ భంగిమనే వివాదానికి కారణమైంది.

సామాజిక మాధ్యమాల్లో ప్రాచుర్యం పొందిన నర్తకుడు బాబా జాక్సన్ ఈ హుక్ స్టెప్ తనదేనని ఆరోపించారు. గతంలో తాను చేసిన నృత్య వీడియోను ప్రస్తావిస్తూ, రెండింటినీ పోల్చి చూపిస్తూ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. దీంతో ఈ అంశం ఒక్కసారిగా వైరల్ అయింది. నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. కొందరు రెండు నృత్య భంగిమలు ఒకేలా ఉన్నాయని అంటుండగా, మరి కొందరు నృత్యాల్లో ఇలాంటి కాళ్ల కదలికలు సాధారణమేనని, వాటిని కాపీగా పరిగణించడం సరైంది కాదని అభిప్రాయపడుతున్నారు.

ఈ పాటకు ప్రముఖ నృత్యదర్శకుడు సుధన్ మాస్టర్ నృత్య రూపకల్పన చేశారు. కాబట్టి ఈ ఆరోపణలపై ఆయన లేదా చిత్ర బృందం స్పందిస్తారా అన్నది ఆసక్తిగా మారింది. ఇప్పటికే ఈ గీతం భారీ ఆదరణ పొందుతున్న నేపథ్యంలో వివాదం మరింత ప్రచారం తీసుకువచ్చింది.

ఈ చిత్రానికి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. యాక్షన్ ప్రధాన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మోహన్ బాబు ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. మరికొంత మంది ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొదట ఈ చిత్రాన్ని మార్చి నెలలో విడుదల చేయాలనుకున్నప్పటికీ, చిత్రీకరణ పూర్తికాకపోవడంతో ఆగస్టు 21కు వాయిదా వేశారు. మాస్ అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రం విడుదలయ్యాక ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన అందుకుంటుందో చూడాలి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in